క్లుప్తంగా

దాలివలసలో ఉచిత ఈఎన్‌టీ వైద్య శిబిరం



ఈఎన్‌టీ పరీక్షలను చేస్తున్న వైద్యులు బండారు రామచంద్రరావు

కె.కోటపాడు : ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రాంత ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందనున్నట్టు కేజీహెచ్‌కు చెందిన ఈఎన్‌టీ వైద్య నిపుణులు బండారు రామచంద్రరావు అన్నారు. దాలివలస గ్రామంలో ఆదివారం సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 120 మందికి పరీక్షలు నిర్వహించిన బండారు రామచంద్రరావు వైద్యంతో పాటు మందులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో భాగంగా ఒమేగా క్యాన్సర్ ఆస్పత్రి వైద్యాధికారి చెన్నకేశవరెడ్డి క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. సంఘమిత్ర రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బొంతు మంగపతి, సభ్యులు సూర్రెడ్డి బాబూరావు, మండలి మురళీకృష్ణ, సూర్రెడ్డి శ్రీనివాసరావు, బండారు మంగపతి, బి.వి.రమణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న ధ్వజస్తంభం ప్రతిష్ట



వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తజనం

దేవరాపల్లి: మారేపల్లి పాండవుల మెట్టపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు భారతానంద మహరాజ్, ఫణీంద్ర శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు, గ్రామ ప్రజలు, పెద్దలు పాల్గొని ధ్వజస్తంభం వద్ద ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ విశ్రాంత వీసీ ముర్రు ముత్యాలనాయుడు పాల్గొని వెంకన్న స్వామిని దర్శించుకున్నారు.

మోదమాంబ ఆలయానికి భక్తుల తాకిడి

మాడుగుల : ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి శ్రావణ ఆదివారం సందర్భంగా భక్తుల తాకిడి పెరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ ఉచితంగా ప్రసాదాలు అందజేసింది.

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించండి



గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

చీడికాడ : ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని మండలంలోని అర్జునగిరిలో శనివారం రాత్రి ఉపాధ్యాయులు,పెద్దలు ప్రచారం నిర్వహించారు. సర్పంచ్ బి.రమాదేవి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను, విద్యా ప్రమాణాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు పెద్దలు జె.సత్యనారాయణ, మోసూరి సింహాచలంనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల ఒడ్డు పండగలు



కె.జె.పురంలో మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్ : గ్రామాల్లో గ్రామ దేవతలు ఒడ్డు పండగలు ఆదివారం నిర్వహించారు. ఎం. కోడూరు, కె.జె.పురం, ఎం.కోటపాడు, సాగరం, తదితర గ్రామాల్లో మోదమాంబ, నూకాంబిక అమ్మవార్ల ఒడ్డు పండగలు నిర్వహించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. ఎం.కోడూరు గ్రామంలో గ్రామ ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు. కె.జె.పురంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.



బొడ్డేరు ప్రాంతంలో ఎండుతున్న నారుమడులు



ఎండుతున్న నారుమడులను నీరుపోసి రక్షించుకుంటున్న రైతు

ఖరీఫ్ నాట్లు... తీరని ఇక్కట్లు!

- 7వేల ఎకరాల్లో ఎండుతున్న వరినాట్లు
- గెడ్డల్లో చుక్క నీరు లేదు
- పదేళ్లలో తొలిసారిగా కరువు ఛాయలు



నిత్యం నీటితో ప్రవహించే ధారగెడ్డలో అడుగంటిన నీరు

గొలుగొండ : ఖరీఫ్‌లో వరినాట్లపై వరుణుడు కరుణ చూపలేదు. వేసిన నారుమళ్లు ఎండిపోతున్నాయి. నిత్యం నీటితో ప్రవహించే గెడ్డల్లో చుక్కనీరు లేకుండా పోయింది. నర్సీపట్నం డివిజన్‌లో గొలుగొండ మండలంలో వరినాట్లు ప్రతి ఏటా ముందుగా జరుగుతుంటాయి. ఇక్కడ నీటి వనరులు అధికంగా ఉండడంతో రైతులు జులై రెండో వారం నుండే నాట్లు వేయడం జరిగేది. కానీ అందుకు భిన్నంగా ప్రస్తుత వాతావరణం రైతులను ఇబ్బందులకు గురి చేస్తోంది. వర్షాలు లేక నారుమడులు ఎండిపోవడం పదేళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.

7వేల ఎకరాల్లో నాట్లకు ఇబ్బందులు

మండలంలో బొడ్డేరు, ధారగెడ్డ, బోరింగ్‌గెడ్డ, గొర్రిగెడ్డ, రావణాపల్లి జలాశయం దిగువ సాధారణ విస్తీర్ణం 7వేల ఎకరాలు. ధారకొండపై కురిసే ప్రతి చినుకు వాగులు, గెడ్డల్లో ప్రవహించేది. దీంతో వర్షం ఏమాత్రం కురిసినా నాట్లకు ఇబ్బందులు ఉండేవి కావు. ఈ ఏడాది నారుమడులు వేసినప్పటి నుంచి ధారకొండపై కొద్దిపాటి వర్షాలు కూడా లేకపోవడంలో గెడ్డలన్నీ ఎండిపోతున్నాయి. దీంతో రైతులకు ఖరీఫ్‌పై నమ్మకం పోతుంది. నారుమడులు వేసి దాదాపుగా నెల రోజులు కావస్తుంది. కొన్ని ప్రాంతాల్లో నారుమడులు పూర్తిగా ఎండిపోయాయి. వేసవిని తలపించేలా ఎండలు కాయడంతో రైతులకు ఏంచేయాలో పోలుపోవడం లేదు.

చుక్కనీరు లేని గెడ్డలు

ధారకొండ దిగువన ఉన్న గెడ్డల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వేసవిలోనైనా కాస్తోకూస్తో నీరు ప్రవహించడం జరిగేది. ఈ ఏడాది కనీసం నీరు లేకుండా పోవడం రైతులు చూస్తున్నారు. ఐదు గెడ్డలపై 28 వరకు చెక్‌డ్యాంల ద్వారా నీరు పంట పొలాలకు చేరుతుండేది. జీవనదుల్లా ప్రవహించే గెడ్డలు సైతం ఈ ఎండలకు పూర్తిగా అడుగంటాయి.

తాండవ పరిస్థితి మరింత దారుణం

తాండవ జలాశయానికి ప్రధాన ఆధారం గొలుగొండ మండలంలో ఉన్న ఐదు గెడ్డలే. ఇక్కడ నుంచి నీరు ప్రవహిస్తే తప్ప తాండవ జలాశయానికి చుక్కనీరు చేరదు. ప్రతి ఏటా ముందుగా ఇక్కడ నాట్లు జరిగితే తరువాత మిగులు నీరు తాండవ జలాశయంకు చేరడం జరుగుతుంటాయి. తాండవ జలాశయానికి జూన్ నెలలో కురిసిన వర్షం నీరు తప్ప ఇప్పటి వరకు నీరు చేరలేదు. ధారకొండపై కురిసే నీరు గెడ్డల ద్వారా గొలుగొండ మండలంలో సాగు జరిగి జలాశయానికి చేరేది. కానీ గొలుగొండ మండలంలో నారుముడులే ఎండిపోతుంటే తాండవ జలాశయం దిగువన ఉన్న 55వేల ఎకరాల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. గత ఏడాది ఆగస్టు నాటికి మండలంలో దాదాపుగా 90 శాతం గొలుగొండ నాట్లు పూర్తయ్యేవి. అప్పట్లో నీరు అంతా తాండవ జలాశయానికి చేరేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కొద్దిపాటి వర్షాలు కురిసినా గొలుగొండ మండలంలో సాగుకు నీరు సరిపోతుంది. భారీ అతిభారీ వర్షాలు కురిస్తే తప్ప తాండవ జలాశయం నిండదు.

ఎన్నడూ చూడని దుస్థితి



వేసిన నారుమడులు ఎండిపోతున్నాయి. ఎన్నడూ ఈ పరిస్థితి చూడలేదు. అన్ని ప్రాంతాల కంటే ముందుగానే నాట్లు వేసుకునేవాళ్లం. కానీ ఈ ఏడాది అందుకు భిన్నంగా ఉంది. కనీసం చుక్క వర్షం కురవకపోవడం చాలా బాధగా ఉంది. ఖరీఫ్‌లో నాట్లుకు ఈ ఏడాది ఇబ్బందులుగానే ఉంది. నారుమడులు రక్షించుకోవడం కోసం చాలా కష్టాలు పడుతున్నాం

–నారాయణమూర్తి, రైతు, గొలుగొండ

గెడ్డలు ఎండిపోవడం ఇదే తొలిసారి..



గడిచిన 40 సంవత్సరాల నుంచి నేను వ్యవసాయం చేస్తున్నాను. ధారకొండపై ఏమాత్రం వర్షం కురిసినా మేము నాట్లు వేసుకునేవాళ్లం. అలాంటిది ఈ ఏడాది ఎన్నడూ లేని విధంగా గెడ్డలు సైతం ఎండిపోవడం చూస్తున్నాం. నారుమడులు వేసి నెల రోజులు అవుతుంది. మరో వారం రోజులు ఉండే నారు ముదిరి పనిచేయదు. ఈలోగా వర్షం కురవకపోతే నారుమడులు సైతం ఎండిపోతాయి.

–నూకరాజు, రైతు, కొత్త జోగుంపేట

మండుతున్న ఎండలు..అన్నదాతలకు గుబులు



శంకరంలో వరి నారుమడులు తడుపుతున్న రైతులు

మాడుగుల : జూలై, ఆగస్టు నెలల్లో వర్షాలు అధికంగా కురవాలి కాని వరుణుడు కరుణించకపోవడంతో వరినాట్లు వేయలేకపోతున్నారు. గత ఏడాది ఆగస్టు మొదటి వారంలోనే వరినాట్లు దాదాపు పూర్తి చేసుకున్నారు. ఈ ఏడాది ఆగస్టు వచ్చినా సరే వర్షాలు కురవక వరినార్లు కూడా ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన చేస్తున్నారు. మండలంలో సాగరం, ఎం.కోడూరు, శంకరం, తాటిపర్తి, వీరవల్లి, కేజేపురం, పోతనపూడి, వీరనారాయణం, గ్రామాల్లో వరినాట్లు వ్యవసాయ మోటార్ల వద్ద వేస్తున్నారు. మండలంలో 12 వేల ఎకరాల్లో వరి నాట్లు వేయాల్సి ఉండగా ప్రస్తుతం 1000 ఎకరాలు కూడా పూర్తి కాలేదని రైతులు చెబుతున్నారు. ఖరీఫ్ సీజన్ దాటిపోతుండడంతో ఈ ఏడాది ఇకపై వర్షాలు అనుకూలించినా సరే దిగుబడులు రావని రైతులు ఆవేదన చెందుతున్నారు. వరి నారుమడులు వేసి నెల దాటిపోతున్నా వర్షాలు అనుకూలించక ప్రస్తుతం ఎండిపోతుండడంతో రైతులు వ్యవసాయ బావి నుంచి వరి నారుమడులు తడుపుతున్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయండి



మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ కార్మికులతో కలిసి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సంఘం గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు

నర్సీపట్నం : ఈ నెల 5న రాంబిల్లి మండలంలో జరిగే భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అడిగర్ల రాజు పిలుపునిచ్చారు. నర్సీపట్నం మున్సిపాలిటీ, బయపురెడ్డిపాలెంలో భవన నిర్మాణ కార్మికుల సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మహాసభలు ఈ నెల 5న రాంబిల్లి మండలంలో జరుగుతున్నాయన్నారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుంచి భవన నిర్మాణ కార్మికులు, ఇతర నిర్మాణరంగ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరుకావాలన్నారు. ఈ మహాసభల్లో మూడేళ్ల కాలంలో చేసిన ఉద్యమాన్ని సమీక్షించి, భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, సంక్షేమ పథకాల అమలు, భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు భవిష్యత్తు ఉద్యమాలకు కార్యాచరణకు సంబంధించి నూతన కమిటీ ఎన్నిక జరుగుతుందన్నారు. విద్యుత్ ఛార్జీల భారం, నిత్యవసర ధరలు పెరగడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే ప్రజలపై తీవ్రమైన విద్యుత్ భారం పడడంతో పాటు జవాబుదారీతనం లేకుండా పోతుందన్నారు. అనకాపల్లి జిల్లాలో ఉన్న అన్ని రంగాల నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులు హాజరై ఈ మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ, మర్రి రమణ, చిన్న, శ్రీరాములు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

వీధి కుక్కల బెడద...కోతులగుంపుతో దడ



పి.పురం గ్రామ సమీపంలో కోతుల గుంపు



నాతవరం వీధుల్లో కుక్కలు గుంపు

నాతవరం : కోతులు మొదట్లో వ్యవసాయ ఉత్పత్తులను మాత్రమే నాశనం చేస్తుండేవి. ఇప్పుడు గ్రామాల్లోకి చొరబడి ప్రజలపై దాడులు చేస్తున్నాయి. ఇటీవల కాలంలో మండల వ్యాప్తంగా 26 మందికి పైగా వ్యక్తులపై కోతులు, కుక్కలు దాడి చేశాయి. కోతులు ఇళ్లలోకి చొరబడే సమయంలో వాటిని బెదిరిస్తే అమాంతంగా మనుషులపై దాడి చేస్తున్నాయి. మండలంలో మర్రిపాలెం వెన్నలపాలెం, శృంగవరం, డి.యర్రవరం, నాతవరం, గాంధీనగరం, రాజుపేట అగ్రహారం, పెదగొలుగొండపేట, ఎ.పి.పురం, ఎంబీ పట్నం, గన్నవరం, గునుపూడి, వల్సంపేట గ్రామాల్లో కోతులు, కుక్కకాటు బాధితులు ఉన్నారు. బాధితుల్లో వృద్ధులు, చిన్నారులు, విద్యార్థులే అధికం. కోతుల దాడిలో గాయపడిన వారికి కూడా కుక్కలు కరిస్తే ఏవిధమైన వ్యాక్సిన్లు చేస్తారో అదే విధంగా ఇంజక్షన్లు పీహెచ్‌సీలో వేస్తున్నారని చెబుతున్నారు. మండలంలో ఎక్కడ చూసిన గుంపులుగా కోతులు దర్శనమిస్తున్నాయన్నాయి. ఇటీవల వెన్నలపాలెం, మర్రిపాలెం గ్రామాల్లో రైతులు సొంతంగా డబ్బులు వేసుకుని బోనుల్లో పట్టుకొని ఏజెన్సీ ప్రాంతాలకు తరలించేవారు. దీంతో కొంతకాలం వాటి బెడద తగ్గినా మళ్లీ ఇపుడు పునరావృతం అవుతోంది. ఇప్పటికే చాలా మంది రైతులు కూరగాయలు పంటలు, పండ్ల తోటలు సాగు చేయడం మానేసారు. పెట్టుబడి పెట్టి పండించిన వ్యవసాయ ఉత్పత్తులు కళ్లెదుటే కోతులు నాశనం చేస్తున్నాయి. గత ఏడాది డిసెంబరు 19వ తేదీన మర్రిపాలెం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు వచ్చిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లినా ఆయన స్పందించలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మంచి సేవలతోనే గుర్తింపు



రిటైరైన ఉపాధ్యాయుడు సత్యనారాయణ, ఎంపీపీ మణికుమారి దంపతులను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ : ప్రభుత్వ ఉద్యోగులు మంచి సేవలు అందిస్తే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉండిపోవడం జరుగుతుందని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. ఉపాధ్యాయుడుగా పనిచేసి పదవీ విరమణ చేసిన గజ్జలపు సత్యనారాయణ వీడ్కోలు సత్కార కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తిలో దాదాపుగా 25 సంవత్సరాలు పనిచేసిన సత్యనారాయణ ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేశారని ఎమ్మెల్యే కొనియాడారు. అనంతరం సత్యనారాయణ, మణికుమారి (గొలుగొండ ఎంపీపీ) దంపతులను ఘనంగా సత్కరించారు. ఏఎల్‌పురంలో జరిగిన ఈ కార్యక్రమానికి నర్సీపట్నం మున్సిపాలిటీ చైర్మన్ బోడపాటి సుబ్బలక్ష్మి, గొలుగొండ జెడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, జిల్లా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షులు లోచల సుజాత, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాణీశాం తారామ్, నర్సీపట్నం యూత్‌పార్టీ అధ్యక్షుడు తమరాన శ్రీనివాస్‌తో పాటు మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నర్సీపట్నానికి చెందిన మున్సిపాటీ కౌన్సిలర్లు హాజరయ్యారు.

పేదలపై స్మార్ట్ మీటర్ల భారం వద్దు



బంగారుమెట్టలో పేదలతో కలిసి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

బుచ్చెయ్యపేట : ప్రభుత్వం పేదలపై స్మార్ట్‌మీటర్ల భారం వేసి వారి జీవితాలు బుగ్గిపాలు చేయొద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం నాయకులు బంగారుమెట్ట, ఎల్‌బీ పురం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి స్మార్ట్ మీటర్ల ఏర్పాట్లు వల్ల కలిగే అనర్థాల గురించి ప్రభుత్వం పేద ప్రజలను ఏ విధంగా మోసం చేస్తున్నదీ కరపత్రాలు పంచి వివరించారు. ఎన్నికల ముందు అధికారంలోకి వస్తే కరెంట్ ఛార్జీలు పెంచం.. స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టండి.. అని ప్రచారం చేసిన మంత్రి లోకేష్ ఇపుడు స్మార్ట్ మీటర్లు బిగించి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్ల బిగింపును ప్రజలంతా వ్యతిరేకించాలన్నారు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

అనకాపల్లి: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, మట్టి గణపతులను మాత్రమే పూజించాలని చింతామణి గణపతి దత్తక్షేత్రం నిర్వాహకుడు ఆంజనేయరాజు తెలిపారు. పట్టణ పరిధి గణపతి దత్తక్షేత్రంలో ఆదివారం ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దత్త విజయానంద తీర్థ స్వామిజీ దివ్యానుగ్రహంలో విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. ఈ నెల 27న వినాయక చవితి పురస్కరించుకుని గణపతి దత్తక్షేత్రంలో నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు.

ఉత్సాహంగా స్నేహితుల దినోత్సవం



దేవరాపల్లిలో ఫ్రెండ్‌షిప్ డే బ్యాండ్స్ కట్టుకుంటున్న బాలికలు



రైవాడ జలాశయం వద్ద సందడి చేస్తున్న స్నేహితులు



వడ్డాదిలో వైస్ ఎంపీపీ లలితా నారాయణమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న స్నేహితులు

దేవరాపల్లి : మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలలో యువతి, యువకులతో పాటు చిన్నారులు సైతం స్నేహితుల దినోత్సవాన్ని వేడుకగా జరుపుకొన్నారు. చిరకాల స్నేహితులంతా ఒక చోట కలిసి ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా గడిపారు. తమ స్నేహానికి గుర్తుగా ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ డే బ్యాండ్స్ కట్టుకొని చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సందడి చేశారు. స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన పలువురు స్నేహితులు రైవాడ జలాశయం వద్దకు చేరుకొని ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ఆనందంగా గడిపారు.

బుచ్చెయ్యపేట : మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల నాయకులు, అధికారులు, వ్యాపారులు, ప్రజలు తమ స్నేహితులకు శుభాకాంక్షలు తెలిపి కేక్‌లు కట్ చేసి స్వీట్లు పంచారు. ఎప్పటికీ మిత్రులంతా కలసిమెలసి ఉండాలని తమ మధ్య ఉన్న స్నేహ బంధాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు.

వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవం



కేక్ కట్ చేసి స్నేహితుల దినోత్సవం జరుపుకొంటున్న క్లబ్ సభ్యులు

నర్సీపట్నం : అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వాకర్స్‌క్లబ్ వారు ఆదివారం మున్సిపల్ స్టేడియంలో స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్లబ్ సభ్యులు అందరూ ఒక చోట చేరి కేక్ కట్ చేసి స్నేహితుల దినోత్సవ శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ఎన్ని బంధాలున్నా మన భావాల్ని స్నేహితులతో పంచుకోవడంలోని ఆనందమే వేరు అని, కష్టాల్లో ఆదుకునేవారు నిజమైన స్నేహితులని క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు. క్లబ్ సభ్యులు అందరూ ఆనందంగా గడిపారు.

ఎండలు బాబోయ్..



ఎండ ధాటికి నిర్మానుష్యంగా వున్న మాడుగుల బస్టాండ్

మాడుగుల రూరల్: వేసవికి దీటుగా ఎండ త్రీవత ఎక్కువగా ఉంది. ఆదివారం ఎండ మే మాసంలో వలే ఎండ త్రీవతతో ప్రజలు అందోళన చెందారు. ఒక వైపు ఎండ త్రీవత, మరో వైపు ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఎండ త్రీవత వల్ల ఖరీఫ్ వరినారు మడులు ఎండిపోతున్నాయని రైతులు అందోళన చెందుతున్నారు.

స్థానిక ఎన్నికల్లో సీట్లు డిమాండ్ చేసి సాధించాలి



పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు

నర్సీపట్నం : స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ పడాలంటే గ్రామస్థాయిలో జనసేన పార్టీ బలపడాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో సీట్లు అడుక్కోకూడదని, లెక్కలతో సహా ఈ పంచాయతీ, ఈ మండలం మాకు కావాలని చెప్పగలిగే స్థాయిలో బలపడాలన్నారు. ఆదివారం నర్సీపట్నంలో జనసేన సీనియర్ నాయకుడు అప్పన్నదొరబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు విజయంలో జనసేన పార్టీ కృషి అభినందనీయమన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో మనకు కావాల్సిన కోటాను డిమాండ్ చేసి సాధించుకునేలా నర్సీపట్నం నియోజకవర్గంలో జనసేన పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమానికి విచ్చేసిన పార్టీ అధ్యక్షుడు, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్, చోడవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.వి.ఎస్.ఎన్ రాజును అప్పన్నదొరబాబు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అద్దెపల్లి సౌజన్య, పార్టీ నాయకులు అద్దెపల్లి గణేష్, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజాన సూర్యచంద్ర పాల్గొన్నారు.

ఉచిత హోమియో వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ తులసీ

మునగపాక: స్థానిక పల్లపువీధిలోని సాంబశివ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన ఉచిత హోమియో వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. విశ్వ మానవతా సంస్థ, గణేష్ బెస్ట్ మార్కెట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో డాక్టర్ తులసీ వైద్య సేవలందించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య అలవాట్లను మార్చుకోవాలన్నారు. పోషక ఆహారాన్ని తీసుకోవాలన్నారు. తాజా ఆహారం తీసుకోవాలని జంక్ ఫుడ్స్ జోలికి పోవద్దన్నారు. తొలుత శిబిరాన్ని సర్పంచ్ దిమ్మల అప్పారావు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, పెద్దలు సూరిశెట్టి కన్నారావు, దాడి శ్రీరామమూర్తి, ఆడారి లక్ష్మణరావు, టెక్కలి దేవకీ, దాడి సాంబశివ, కోరుకొండ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.